సాక్షి
కుమురం భీం

మంగళవారం। 16। సెప్టెంబర్। 2025



పర్యాటకులకు నిరాశే..
సెలవుల్లో కవ్వాల్‌ను సందర్శించాలనుకునే వారికి ఈసారి నిరాశే మిగిలింది. అక్టోబర్ నుంచే పర్యాటకులను అనుమతివ్వాలని అటవీశాఖ నిర్ణయించింది. 8లో▸



పింఛన్లు పెంచాలని వినతి
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పలు మండలాల్లో వినతిపత్రాలు అందించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.2 /25.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

యూరియా.. బారులు

- రైతులకు తప్పని తిప్పలు
- బస్తాల కోసం తెల్లవారుజాము నుంచే నిరీక్షణ
- పలుచోట్ల ఆందోళనలు చేపట్టిన అన్నదాతలు

దహెగాం(సిర్పూర్): జిల్లాలోని రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. బస్తాలు అందిస్తున్నారని తెలియగానే పంపిణీ కేంద్రాలకు తెల్లవారుజామునే పనులన్నీ వదులుకుని చేరుకుంటున్నారు. ఖాళీ కడుపుతో కార్యాలయం తెరవకముందు నుంచి క్యూలైన్లు కడుతున్నారు. జిల్లాలో 4.50 లక్షలకు పైగా ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. పత్తితోపాటు వరి పంటకు ఎరువులు వేసే సమయం కావడంతో సోమవారం పలు మండలాల్లో అన్నదాతలు యూరియా బస్తాల కోసం బారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టాల్సి వచ్చింది. దహెగాం పీఏసీఎస్సీలో రెండు లారీ లోడ్లు 800 బస్తాలు, గిరవెల్లి రైతువేదిక వద్దకు 800 బస్తాలు రాక రైతులు బారులు తీరారు. ముందుగా టోకెన్లు తీసుకున్నవారికి ఎకరానికి ఒకటి, రెండు బస్తాలు అందించారు.



దహెగాంలోని సొసైటీ వద్ద కార్యాలయం తెరవక ముందే గుమిగూడిన రైతులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): మండలంలోని ఎల్కపల్లి రైతువేదిక వద్ద యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో బారులుతీరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో రెండు లారీ లోడ్ల బస్తాలు రానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తుగా టోకెన్లు జారీ చేశారు.

రోడ్డెక్కిన అన్నదాత



ఏవోతో వాగ్వాదం చేస్తున్న రైతులు

కెరమెరి(ఆసిఫాబాద్): యూరియా కోసం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. ఎక్కడిక్కడ వాహనాలు నిలిచిపోయాయి. 'కావాలి కావాలి.. యూరియా కావాలి..' అంటూ నినాదాలు చేశారు. ఏవో యుగేంధర్, ఎస్సై మధుకర్ రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. మూడు వాహనాలు వచ్చినట్లు సమాచారం ఉందని, కానీ ఒకే లోడ్ ఇక్కడ దింపారని, సాగుఎకరాల ప్రకారంగా యూరియా పంపిణీ చేయాలని పట్టుబట్టారు. ఏవో మాట్లాడుతూ ఇండెంట్ పంపించినా ఒకటే లోడ్ వచ్చిందని, ఒకరికి రెండు బస్తాలే మాత్రమే ఇస్తామని చెప్పారు. రెండు రోజుల్లో మరో వాహనం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా సోమవారం ఉదయం 5 గంటలకే రైతులు కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 8:30 గంటలకు అధికారులు వచ్చి టోకెన్ల ప్రకారం బస్తాలు ఇవ్వడం ప్రారంభించడంతో కొంత వాగ్వాదం జరిగింది. క్యూలో ఉన్నవారికి ఇవ్వాలని కొందరు పట్టుబట్టారు. ఏఈవో, ఎస్సై వారిని శాంతింపజేశారు.

క్యూలైన్‌లో చెప్పులు



వరుస క్రమంలో ఉంచిన చెప్పులు

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలో శనివారం యూరియా పంపిణీ చేపట్టగా అందరికి అందలేదు. లోడ్ వచ్చిన తర్వాత అందిస్తామని చెప్పడంతో వెనుదిరిగిన వారంతా సోమవారం ఉదయమే తిర్యాణి పీఏసీఎస్ పంపిణీ కేంద్రం వద్దకు చేరుకున్నారు. కేంద్రం ఎదుట తమ చెప్పులను క్యూలో ఉంచారు.

లారీ అడ్డగింత

దహెగాం మండలంలోని గిరవెల్లి రైతువేదికకు యూరియాతో వెళ్తున్న లారీని చినరాస్పెల్లి గ్రామం వద్ద రైతులు అడ్డుకున్నారు. చినరాస్పెల్లిలో యూరియా అందించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ కుమారస్వామి వారికి సర్ది చెప్పారు. గిరవెల్లి రైతు వేదిక వద్దకు వెళ్లి బస్తాలు తీసుకోవాలని సూచించగా, ఏవో రామకృష్ణ వారికి అక్కడే టోకెన్లు అందించారు. దీంతో రైతులు శాంతించి రైతు వేదిక వద్దకు వెళ్లి యూరియా బస్తాలు తీసుకున్నారు.



చినరాస్పెల్లి వద్ద లారీకి అడ్డంగా బైఠాయించిన రైతులు

స్టాక్ ఉన్నా తప్పని తిప్పలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు దాదాపు 2,200 యూరియా బస్తాలు వచ్చినా రైతుల ఆందోళనలు తగ్గడం లేదు. రైతు వేదిక వద్దకు భారీ సంఖ్యలో రైతులు రాగా.. పాత టోకెన్లు పూర్తయ్యాక కొత్తవి జారీ చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించారు. పంటలు దెబ్బతింటుండగా అధికారులు బస్తాలు అందుబాటులో ఉంచుకుని టోకెన్లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆగ్రహించిన అన్నదాతలు జాతీయ రహదారికి పైకి వచ్చి బైఠాయించారు. ఎస్సై వెంకటకృష్ణ కొత్త టోకెన్లు ఇప్పిస్తామని నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.



టోకెన్లు అందించాలని రెబ్బెన జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు

పాసుపుస్తకాలు, జిరాక్స్‌లు

రెబ్బెన పీఏసీఎస్‌లో దాదాపు 2,200 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు ప్రకటించడంతో రైతులు తెల్లవారుజామునే రైతువేదిక వద్దకు చేరుకున్నారు. అధికారులు వచ్చేందుకు సమయం పట్టడంతో పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను క్యూలైన్లో పెట్టి నిరీక్షించారు. అనంతరం టోకెన్ల వారీగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందించారు. ఎస్సై వెంకటకృష్ణ పంపిణీని పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

ప్రజాపాలన దినోత్సవ అతిథులు వీరే..

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అతిథులను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాకు పలువురు ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఉదయం 9.30గంటలకు జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండావిష్కరణ, గౌరవ వందనం స్వీకరిస్తారు. అభివృద్ధి పనులపై ప్రసంగిస్తారు. ఆదిలాబాద్ జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంచిర్యాల జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, నిర్మల్ జిల్లాకు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య హాజరు కానున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాలో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌కు చెందిన విద్యార్థులు దక్షిణ భారత సైన్స్‌ఫేర్‌కు ఎంపికయ్యారని హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు సోమవారం తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు కామారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో చరణ్, సాకేత్, హరిచరణ్ ప్రతిభ చూపి బహుమతులు అందుకున్నారని పేర్కొన్నారు. వీరు ఈ నెల 18 నుంచి 20 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే దక్షిణ భారత సైన్స్‌ఫేర్‌లో పాల్గొంటారని వివరించారు.

వేతనాలు ఇప్పించండి సారూ..!



వినతిపత్రం ఇస్తున్న వర్కర్లు

ఆసిఫాబాద్‌రూరల్: 'మా పెండింగ్ వేతనాలు ఇప్పించండి సారూ' అని గిరిజన ఆశ్రమ పాఠశాల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదని తెలిపారు. 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు రెగ్యులరైజ్ చేయాలని, టైం పే స్కేల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణమాచారి, గంగుబాయి, జంగుబాయి, రాధాబాయి, లక్ష్మి, సదాశివ్, సంతోష్, రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని కాగజ్‌నగర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సోమవారం పట్టణంలోని కార్యాలయ ఆవరణలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ రూ.1.50 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు శంకర్, సంజీవయ్య, అశోక్, తిరుపతి, కార్మికులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించడంలో విఫలం'

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి సివిల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సింగరేణి యాజమాన్యం విఫలమైందని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ ఆరోపించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సివిల్ డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 26 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదన్నారు. గోలేటి బ్రాంచి వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, ఐఎఫ్‌టీయూ గోలేటి బ్రాంచి అధ్యక్షుడు పోషం, కార్యదర్శి శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయొద్దు

ఆసిఫాబాద్‌అర్బన్: వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చి బాధితులు అందించే ఫిర్యాదులను పోలీసులు నిర్లక్ష్యం చేయొద్దని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి సమస్య స్థితిని తెలుసుకున్నారు. బాధితుల సమస్యలు పరిష్కరించేందుకు పోలీసులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

పురుషోత్తంరావు ఆశయాలు సాధిస్తాం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, డీఎస్పీ వహీదుద్దీన్

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజా సేవలో ప్రాణాలు త్యాగం చేసిన నేత, దివంగత ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు ఆశయాలు సాధిస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో సోమవారం ప్రజాబంధు పాల్వాయి పురుషోత్తం రావు స్మారక క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే హరీశ్‌బాబు, కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పురుషోత్తం రావు 26వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పురుషోత్తం రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే నివాసం, పట్టణంలోని నౌగాం బస్తీలో నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, వీరభద్రచారి, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌కు సన్నద్ధం కావాలి

ఆసిఫాబాద్: స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్(ఎస్ఐఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్వో లోకేశ్వర్ రావు హాజరయ్యారు. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితాలో డూప్లికేట్, దొంగ ఓట్ల తొలగింపునకు 20 నుంచి 25 ఏళ్లకు ఒకసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో 2002లో ఎస్ఐఆర్ చేపట్టినట్లు పేర్కొన్నారు. దీనిపై మాస్టర్ ట్రైనర్ల ద్వారా బూత్‌స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. బిహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఇటీవల ఎస్ఐఆర్ చేసినట్లు వివరించారు. ప్రతీ పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్ఐఆర్ డేటాను 2025 ఎస్ఎస్ఆర్ డేటాతో సరిపోల్చుకోవాలని సూచించారు. ప్రతీ బీఎల్‌వో వద్ద రెండు హార్డ్ కాపీలు ఉండాలన్నారు. రెండు జాబితాల్లో కామన్‌గా ఉన్న పేర్లు మినహాయించి, 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధ్రువీకరించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి, ఏఈఆర్‌వో, డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో తరచూ సమావేశాలు నిర్వహించాలని అన్నారు.

'అమ్మ' మొక్కను బతికించాలి



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, పక్కన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: అమ్మ పేరుతో నాటిన మొక్కను బతికించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో మొక్కలు నాటించారు. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి వారు మొక్కలు నాటారు. జిల్లాలోని 1,065 పాఠశాలల్లో 20,327 మొక్కలు నాటినట్లు తెలిపారు. విద్యార్థులు అమ్మ పేరుతో నాటిన మొక్క ఫొటోను ఏకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ఎంఈవో సుభాష్, ప్రిన్సిపాల్ మహేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీ ఇచ్చి.. గోడు చెప్పుకుని

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు తరలివచ్చి అర్జీలు సమర్పించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు తమ గోడు చెప్పుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పింఛన్ పుస్తకంలో ఆధార్ నంబర్ సరిచేయాలని కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లికి చెందిన చాపిడి మీరాబాయి కోరింది. వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్‌కు చెందిన హివ్రే లక్ష్మిబాయి దరఖాస్తు చేసుకుంది. తన భర్త చనిపోయాడని, వితంతు పింఛన్ మంజూరు చేయాలని బెజ్జూర్ మండలం సలుగుపల్లికి చెందిన దేవి కమల వేడుకుంది. ఉపాధి హామీ పనులు చేసిన తమకు డబ్బులు ఇప్పించాలని రెబ్బెన మండల కేంద్రానికి చెందిన కనక లక్ష్మిబాయి దరఖాస్తు అందించింది. వాంకిడి మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో వంట మనిషిగా పనిచేసిన తనను ఉద్యోగం నుంచి తొలగించారని, తిరిగి తీసుకోవాలని వాంకిడి మండల కేంద్రానికి చెందిన సునీత చౌదరి కోరింది. జిల్లాలో తన తండ్రి పేరుతో ఉన్న భూమిని తన పేరుపైకి పట్టా మార్చాలని మహారాష్ట్రలోని గడ్చరోలికి చెందిన పిడుతు సత్తయ్య దరఖాస్తు చేసుకున్నాడు. బెజ్జూర్ మండలం సలుగుపల్లికి చెందిన కమలాబాయి తన భర్త అనారోగ్యంతో మృతి చెందాడని, జీవనోపాధి కోసం ఏదైనా ఆశ్రమ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ కింద ఉపాధి కల్పించాలని వేడుకుంది. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

పింఛన్ మంజూరు చేయాలి



మూడేళ్ల క్రితం నా భర్త చనిపోయాడు. కుటుంబ పోషణకు ఏ ఆధారం లేదు. ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాను. ప్రభుత్వం వితంతు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– జుమ్మిడి కమల, కౌటాల

స్థలం ఉంది.. ఇల్లు ఇవ్వండి



నేను నిరుపేదనైన నాకు జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలం ఉంది. ఇందిరమ్మ ఇల్లు కోసం ఇప్పటి వరకు రెండు సార్లు దరఖాస్తు చేసుకున్నాను. లిస్టులో పేరు లేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

– ఎస్‌కే సాబీర్, వైఎస్సార్ కాలనీ, ఆసిఫాబాద్

ఆర్థిక ఇబ్బందులతో సతమతం



కోసిని గ్రామంలో సుమారు 20 మంది వితంతువులం ఉన్నాం. వివిధ కారణాలతో భర్తలను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాం. ప్రభుత్వం అందించే పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నాం. అధికారులు స్పందించి పింఛన్లు మంజూరు చేయాలి.

– కోసిని గ్రామ మహిళలు, మం.కాగజ్‌నగర్

ఎమ్మెల్యే ఇంటి ఎదుట అంగన్‌వాడీల ధర్నా



ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసం ఎదుట సోమవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్‌లు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ.18వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ జీవో నం.8 సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, 24 రోజుల సమ్మె కాలపు వేతనం ఇతర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌తోపాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వనిత, ఉమాదేవి, తార, రాధ, సువర్ణ, రాజేశ్వరి, చంద్రకళ, తిరుపతమ్మ తదతరులు పాల్గొన్నారు.

సమాజంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

రెబ్బెన(ఆసిఫాబాద్): సమాజంలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమైందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్ షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సృజనాత్మకతో పనిచేసే ప్రతీ ఇంజినీరు దేశానికి ఎంతో అవసరమన్నారు. సైన్స్ అంటేనే తెలుసుకోవడమని, ఇంజినీరింగ్ అంటేనే సృష్టించడం అని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ నిర్విరామంగా కొనసాగేందుకు అన్ని విభాగాలు ఎంతో అవసరమని, అందులో ఇంజినీరింగ్ విభాగం ఎంతో కీలకమన్నారు. అనంతరం సివిల్ డీజీఎం ఎస్‌కే మదీనాబాషాను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీరు కృష్ణమూర్తి, డీజీఎం ఉజ్వల్‌కుమార్, ప్రాజెక్టు ఇంజినీరు వీరన్న, పర్సనల్ హెచ్‌వోడీ శ్రీనివాస్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీ ఇంజినీర్లకు సన్మానం

గోలేటి స్పోర్ట్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే సందర్భంగా గోలేటి సీహెచ్‌పీలో పనిచేస్తున్న ఇంజినర్లను ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అన్నం రమేశ్, సభ్యులు మహేందర్‌రెడ్డితో కలిసి సీహెచ్‌పీ హెచ్‌వోడి కోటయ్యతోపాటు మిగిలిన వారిని శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు.



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులో మంటలు



బస్సులో చెలరేగుతున్న మంటలు

ఇచ్చోడ: ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం నిజామాబాద్ బయలుదేరింది. ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల వద్దకు రాగానే ఒక్కసారిగా ఇంజన్‌లోంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డుపక్కన ఆపి ప్రయాణికులను కిందకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. సంఘటన సమయంలో బస్సులో దాదాపుగా 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కొలాంగూడలో ఆలయంలో వెండి ఆభరణాలు దొంగిలించిన టేకం రాజును సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆలయంలో చోరీ జరిగినట్లు గ్రామానికి చెందిన కొడప దినేష్ ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు.

వ్యక్తి అదృశ్యం



ఉద్ధయ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: ఇచ్చోడ మండలంలోని దాబా గ్రామానికి చెందిన జాదవ్ ఉద్ధయ్ గతనెల 14న ఇంద్రవెల్లి మండలంలోని లాల్‌టెకిడిలో ఉంటున్న బాబాయ్ జాదవ్ ప్రహ్లాద్ ఇంటికి వచ్చాడు. 15న సాయంత్రం ఇంటికి వెళ్తానని చెప్పి బయల్దేరాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

నదీ తీరానికి కొట్టుకు వచ్చిన మృతదేహం

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి గ్రామ గోదావరి నదీ తీరంలో సోమవారం మృతదేహం కొట్టుకువచ్చింది. చేపల వేటకు వెళ్లిన జాలర్లు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రవీందర్ ఘటనా స్థలానికి వెళ్లి జాలర్ల సహాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్‌కు చెందిన భగవాన్‌గా గుర్తించినట్లు ఎస్సై వివరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన వెల్లడించారు.

జేఎల్‌ఎం ఆత్మహత్యాయత్నం!

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలోని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయం పైనుంచి జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) దూకేందుకు యత్నించిన ఘటన కలకలం రేపింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు చెన్నూర్‌కు చెందిన బూసి రాజు తండ్రి బూసి వందనం విద్యుత్‌శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ 2020లో మృతి చెందాడు. కారుణ్య నియామకం కింద 2022లో రాజు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జూనియర్ లైన్‌మెన్‌గా విధుల్లో చేరాడు. తన తల్లి రోజామణికి విద్యుత్‌శాఖ నుంచి రావాల్సిన బెనిఫిట్స్‌కోసం అప్పటినుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో మనస్థాపం చెందాడు. సోమవారం ఎస్‌ఈ కార్యాలయం పైనుంచి దూకేందుకు యత్నించడంతో అధికారులు నచ్చజెప్పి కిందకు దించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంజేపీ విద్యార్థులు



విద్యార్థులతో అధ్యాపక బృందం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జోనల్ స్థాయి ఈత పోటీల్లో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో బ్యాక్ స్ట్రోక్, ఫ్రీ స్టైల్ అంశాల్లో పదోతరగతి చదువుతున్న ఎస్.అరవింద్, అండర్-17 విభాగంలో బ్యాక్‌స్ట్రోక్ అంశంలో తొమ్మిదోతరగతి చదువుతున్న టి.అభిరామ్, అండర్-14 విభాగంలో ఫ్రీ స్టైల్ అంశంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.హర్ష ఎంపికయ్యారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. సదరు విద్యార్థులను ఎంజేపీ ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ, ప్రిన్సిపాల్ సేరు శ్రీధర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ నాగజ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ సురేశ్, పీఈటీ నగేశ్, అధ్యాపక బృందం అభినందించారు.

పర్యాటకులకు నిరాశే..



అటవీ శాఖ ఏర్పాటు చేసిన సఫారీ వాహనాలు

- అక్టోబర్ మొదటివారంలోనే సఫారీ ప్రయాణం
- ఈనెల 21 నుంచి ముందస్తు దసరా సెలవులు
- ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు అనుమతి నిరాకరణ

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్‌లోని బైసన్‌కుంట, గొండుగూడ బేస్‌క్యాంపు, వాచ్‌టవర్ ప్రదేశాల్లో సఫారీ ప్రయాణం పర్యాటకులకు నిరాశే మిగిలింది. దసరా సెలవులు ముందుగానే ఈనెల 21 నుంచే ప్రారంభమవుతున్నాయి. హైదరాబాద్, వరంగల్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అటవీశాఖ ఇచ్చిన సమయం ప్రకారం అక్టోబర్ మొదటివారంలో సఫారీ ప్రయాణం ప్రారంభమవుతుంది. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ 30 వరకు అడవిలోకి వాహనాలను అనుమతించరు. వన్యప్రాణులు ఎదకు వచ్చే సమయంలో అలజడి లేకుండా చూస్తారు. వర్షాల కారణంగా రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. అందుకే సఫారీ ప్రయాణాన్ని మూడు నెలలపాటు అధికారులు నిషేధిస్తారు.

అనుమతి తప్పనిసరి

పర్యాటక శాఖ రెండు, అటవీశాఖ ఐదు సఫారీలు ఏర్పాటు చేశారు. జూలై నుంచి సెప్టెంబర్‌లో పర్యాటకుల సంఖ్య తగ్గుముఖం పడుతుంది. దసరా నుంచి మళ్లీ తిరిగి వారి సంఖ్య పెరుగుతుందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సఫారీ ప్రయాణానికి అటవీ అధికారుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు ఉంటుంది. అడవిలో పర్యాటకుల కోసం ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేశారు.

పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది



ఏటా జూలై నుంచి సెప్టెంబర్‌లో సఫారీ ప్రయాణానికి అటవీ అధికారులు అనుమతి ఉండదు. అక్టోబర్‌లో సఫారీ మొదలవుతుంది. దసరా సెలవుల్లో పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. సెప్టెంబర్ 21 నుంచి సెలవులు కారణంగా సఫారీకి అనుమతి ఉండదు. ఈ విషయంలో అటవీ అధికారులు ఆలోచించాలి.

– వీరేందర్, హరిత రిసార్ట్ మేనేజర్

అక్టోబర్ మొదటి వారంలో..



వర్షాల కారణంగా సఫారీ ప్రయాణించే రోడ్లు కొట్టుకుపోతాయి. పర్యాటక శాఖ అధికారులు ఈ విషయంలో సంప్రదించారు. కాని వర్షాలు పడుతున్నందున వన్యప్రాణులు సంతతి పెంచుకుంటాయి. వాటి స్వేచ్ఛకు భంగం కలుగకుండా చూడాలి. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్టోబర్ మొదటి వారంలోనే సఫారి ప్రయాణానికి అనుమతి ఉంటుంది.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో

యాత్రాదానానికి దాతలు ముందుకు రావాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భవానీ ప్రసాద్



భవానీ ప్రసాద్

ఆదిలాబాద్: ఆర్టీసీ ప్రారంభించిన యాత్రాదానం కార్యక్రమానికి విరాళాలు ఇవ్వడానికి దాతలు ముందుకు రావాలని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్.భవానీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారం రోజుల క్రితం ఈ నూతన కార్యక్రమానికి సంస్థ శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వ్యక్తుల పుట్టిన రోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, ఇతర శుభకార్యాల వంటి ప్రత్యేకమైన రోజుల్లో అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థుల యాత్రలకు ఈ కార్యక్రమాల ద్వారా విరాళాలు అందించవచ్చన్నారు. వీరందరినీ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహార యాత్రలకు తీసుకెళ్లడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రత్యేక రోజున అవసరమైన విరాళాన్ని సంస్థకు అందిస్తే ఆర్టీసీ ఎంపిక చేసిన ప్రయాణికులకు బస్సు సదుపాయం కల్పిస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్నారైలు, సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో విరాళం చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. దాతలు చెల్లించే విరాళానికి అనుగుణంగా కిలోమీటర్ల ప్రాతిపదికన విహారయాత్రలకు ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను సంస్థ ఏర్పాటు చేస్తుందన్నారు. సరికొత్త కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా దాతలు ముందుకు రావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోల పరిధిలో 9959226002, నిర్మల్ డిపో పరిధిలో 9959226003, భైంసా డిపో పరిధిలో 9959226005, ఆసిఫాబాద్ డిపో పరిధిలో 995926006, మంచిర్యాల డిపో పరిధిలో 9959226004 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ప్రశంసపత్రం అందుకుంటున్న వినోద్‌కుమార్

జన్నారం: మండలంలోని మహ్మదబాద్ గ్రామానికి చెందిన దుర్గం వినోద్‌కుమార్ ఈ నెల 14న నల్గొండలో జరిగిన 12వ సీనియర్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 9 నుంచి 12 వరకు కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొనున్నాడు. తెలంగాణ యోగా అసోసియేషన్ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మనోహర్ చేతుల మీదుగా బంగారు పతకంతో పాటు ప్రశంసపత్రం అందుకున్నారు.

18న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్: ఈ నెల 18న బాలబాలికల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ పటేల్ కాలేజీలోని సాధన డిఫెన్స్ స్పోర్ట్స్ అకాడమీలో 35వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ సమీపంలోని ముప్కల్ గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 18న ఉదయం 9 గంటలకు అకాడమీ వద్దకు వచ్చి రిపోర్టు చేయాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు 99120 29691 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు పాఠశాలల తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాకు వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసాచారిని నియమించారు. పది పాఠశాలలను పర్యవేక్షించి 23 అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. వీటిలో విద్యార్థుల నమోదు, ప్రీప్రైమరీ స్కూల్, యూడైస్, అపార్, విద్యార్థుల సామర్థ్యాలు, కంప్యూటర్ల మరమ్మతులు, పారిశుద్ధ్యం, ఎఫ్‌ఆర్‌ఎస్, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాల సరఫరా, పాఠశాలలో మౌలిక వసతులు, పెండింగ్‌లో ఉన్న పనులు, ఎఫ్‌ఎల్‌ఎం, పీఎం పోషణ్, పీఎంశ్రీ, భవిత సెంటర్లు, క్లాస్‌రూమ్ ట్రాన్స్‌జాక్షన్ తదితర అంశాలను పరిశీలించి లోపాలను పాఠశాల డైరెక్టర్‌కు నివేదించనున్నారు. ఈ నివేదిక ప్రకారం ప్రభుత్వ పాఠశాలల, ఉపాధ్యాయుల పనితీరు తేటతెల్లం కానుంది. ఏయే పాఠశాలలను తనిఖీ చేస్తారనేది అప్పటికప్పుడే నిర్ణయించనున్నారు. వీరి వెంట జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు ఉండనున్నారు.

పాత నేరస్తుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన పాత నేరస్తుడు ఎస్‌డీ ముషరఫ్ అలియాస్ బడా ముషరఫ్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. నిందితుడిపై గతంలో గంజాయి, దొంగతనం కేసులు ఉండగా చిల్కూరి లక్ష్మీనగర్‌లో దొంగతనానికి పాల్పడ్డ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితునికి గంజాయి పరీక్ష నిర్వహించగా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



మృతదేహానికి పంచనామా చేస్తున్న పోలీసులు

లక్సెట్టిపేట: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుఉంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని హన్మంతుపల్లె గ్రామానికి చెందిన జెడ కిష్టయ్య (36) కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం పంట పొలాలకు అవసరమయ్యే పురుగు మందులు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లగా అవసరం ఉన్నదానికంటే ఎక్కువ ఎందుకు తీసుకు వచ్చావని అతని రెండో భార్య లక్ష్మి మందలించింది. అప్పటికే అతను మద్యం మత్తులో ఉండటంతో ఇద్దరు గొడవపడ్డారు. దీంతో ఆమె గ్రామంలోని తెలిసిన వారి ఇంటికి వెళ్లింది. సోమవారం ఇంటికి వచ్చి చూసే సరికి కిష్టయ్య వాంతులు చేసుకుంటున్నాడు. పురుగుల మందుతాగానని చెప్పడంతో వెంటనే ముందుగా లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని సోదరుడు లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి



శంకరయ్య మృతదేహం

బెల్లంపల్లిరూరల్: విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై బండి రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెర్కపల్లికి చెందిన కర్రె శంకర్ (శంకరయ్య) (55) సోమవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ బోర్డు నుంచి పొగలు రావడంతో దగ్గరకు వెళ్లి వైర్లను తాకగా సర్వీస్ వైర్ తెగి అతని చేతికి తగిలింది. విద్యుత్ షాక్‌కు గురికావడంతో కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య లక్ష్మి, కుమార్తె ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు ..

మంచిర్యాలక్రైం: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మజారొద్దీన్ తెలిపిన వివరాల మేరకు తిలక్‌నగర్‌కు చెందిన ఆకుల ఈశ్వర్ ప్రసాద్ (17) ఈ నెల 13న బిర్యానీ తినేందుకు అతని బాబాయ్ కుమారుడైన రఘువీర్‌తో కలిసి బైక్‌పై మంచిర్యాలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సూర్యనగర్ రోడ్డునంబర్ 5 వద్దకు రాగానే మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన శ్రీకాంత్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఈశ్వర్ ప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఈనెల 14న హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈశ్వర్ ప్రసాద్ తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందడంతో బాబాయ్ శివకృష్ణ వద్ద ఉంటున్నాడు. శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..



తిరుపతి (ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్: రెబ్బెన మండలం వంకులం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆసిఫాబాద్‌కు చెందిన ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయాలపాలైన విషయం తెలిసిందే. గాయపడిన వారిలో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎన్నం తిరుపతి (46)ని మెరుగైన వైద్యం అందించేదుకు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య సరిత, కుమారులు చరణ్, ప్రేం ఉన్నారు. ఇదే ప్రమాదంలో గాయపడిన ఎన్నం కృష్ణకుమార్ కరీంనగర్‌లో చికిత్స పొందుతుండగా అతనిపరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

మురుగుకాలువలో పడి ఒకరు..

కాసిపేట: మురుగుకాలువలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు ముత్యంపల్లికి చెందిన మారం కుమార్ (42) శుక్రవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కాసిపేట కాలువ కల్వర్టుపై పడుకుని ఉన్నట్లు సీసీటీవీ ఆధారంగా పోలీసులు గుర్తించారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కల్వర్టు పైనుంచి కాలువలో పడి ఉంటాడని, శుక్రవారం కురిసిన భారీ వర్షానికి నీటి ప్రవాహంలో కాలువ పైపులో ఇరుక్కుని ఉంటాడని అనుమానిస్తున్నారు. సోమవారం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తీసేందుకు ఎవరూ సహకరించక పోవడంతో పోలీసులే బయటకు తీశారు. మృతునికి తల్లి, భార్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

పరవళ్లు తొక్కుతున్న 'గొల్లవాగు'



భీమారం మండల కేంద్రం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ వద్ద ఏర్పడ్డ జలపాతం చూపరులను ఆకట్టుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్ నిండడంతో మత్తడిద్వారా వచ్చిన వరదనీరు వాగులో కలిసేచోట రాళ్లపై జారుతున్న జలపాతం సందర్శకులను కనువిందు చేస్తోంది. – భీమారం

35 శాతం లాభాల వాటా చెల్లించాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

జైపూర్: సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో నుంచి 35 శాతం కార్మికులకు చెల్లించాలని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందారం ఐకే1ఏ, ఐకే-ఓసీపీపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకుముందు జరిగిన స్ట్రక్చరల్ సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్స్‌పై యాజమాన్యం ఇప్పటివరకు సర్క్యులర్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ 12న జరగాల్సిన స్ట్రక్చరల్ సమావేశాన్ని బాయ్‌కట్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే.బాజీసైదా, నాయకులు బాలకృష్ణ, నవీన్ రెడ్డి, శ్రీకాంత్, నర్సింగరావు, వెంకటేశ్, దేవేందర్, సత్తయ్య, నవీన్, పద్మరాజ్, శ్రీనివాస్, సతీశ్, సంజీవ్, యూసఫ్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ పీవో చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆదిలాబాద్ మండలం మావలకు చెందిన గోదావరి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని, జైనూర్ మండలం భూసిమెట గ్రామస్తులు సీసీరోడ్డు మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం ఛాప్రాలకు అంగన్‌వాడీ సెంటర్ మంజూరు చేయాలని అర్జీలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

జన్నారం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ ఖేల్ కన్వీనర్ పందిరి మనీష్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ ఖేల్ కాలేజ్ ప్రెసిడెంట్ రిశ్వంత్, సెక్రటరీ అంజేష్, నాయకులు మహేష్, అమన్, అభిలాష్, సాయి, సంజయ్, అధికసంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాసర ఆర్జీయూకేటీలో ఇంజినీర్స్ డే



బాసర: నివాళులర్పిస్తున్న అధికారులు



జైపూర్: నివాళులర్పిస్తున్న ఎస్టీపీపీ అధికారులు

బాసర: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సోమవారం బాసర ఆర్జీయూకేటీలో ఇంజినీర్స్ డే నిర్వహించారు. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల అధిపతులు పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ మాట్లాడుతూ కళాశాలలో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడానికి అవసరమైన అన్ని రకాల అధునాతన లాబొరేటరీస్ అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్టీపీపీలో...

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్మిన్ భవన కార్యాలయంలో భారతదేశ తొలి ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ నేడు ప్రతీపని ఇంజినీరింగ్‌తో ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం నరసింహారావు, సీఎంవోఏఐ బ్రాంచ్ సెక్రెటరీ సంతోశ్‌కుమార్, ఏజీఎంలు మురళీధర్, శ్రీనివాస్, అజాజుల్లాఖాన్, పంతులా, కిరణ్‌బాబు, పాల్గొన్నారు.

భూ రికార్డుల తరలింపు



వాహనంలో తరలిస్తున్న రికార్డులు

కైలాస్‌నగర్: సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖకు సంబంధించిన భూ రికార్డుల తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాల పునర్విభజన జరిగి తొమ్మిదేళ్లు గడుస్తున్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన రికార్డుల నిర్వహణ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగానే కొనసాగుతోంది. అయితే ఇటీవల కలెక్టరేట్ ఏ బ్లాక్ అంతస్తు పైకప్పు కూలిన నేపథ్యంలో అక్కడి కార్యాలయాల తరలింపు అనివార్యంగా మారింది. దీంతో ఇన్నాళ్లు ఉమ్మడి జిల్లాగా కొనసాగిన భూ రికార్డులు, దస్త్రాల తరలింపును ఆయా జిల్లాలకు తరలించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు సంబంధించిన భూ రికార్డులను ఆయా జిల్లాలకు తరలించారు. తాజాగా నిర్మల్ జిల్లాకు సంబంధించిన భూ రికార్డులను సోమవారం ప్రత్యేక వాహనంలో తరలించారు. భూమికి సంబంధించిన నక్షలు, టిప్పన్‌లు, తదితర రికార్డులను ఆ జిల్లాకు సంబందించిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు తీసుకెళ్లారు. ఎంతో కీలకమైన ఈ భూ రికార్డుల తరలింపులో సంబంధిత శాఖాధికారులు అందుబాటులో ఉండకుండా కేవలం తాత్కాలిక అప్రెంటిస్‌షిప్‌లో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్లపై ఆధారపడడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఏమైనా రికార్డులు తప్పిపోతే బాధ్యులెవరనే ప్రశ్నలు తలెత్తాయి. అధికారులు దగ్గరుండి తరలించాల్సిన రికార్డులను కేవలం అప్రెంటిస్ సిబ్బందిపై ఆధారపడి తరలించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.